# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈరోజు పర్యటించనున్నారు.**

3. **వచ్చే ఆరు నెలల్లో రాజధాని పరిధిలో ప్రస్తుతం ఉన్న రహదారులను అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ పేరుతో ప్రతిపాదిత పథకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

5. **తెలంగాణలో 10వ తరగతి పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**

==========================

రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం సూరంపల్లిలో జరిగిన 'పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ' మూడో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. అస్సాం రాష్ట్రం, గౌహతీలో ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా పీఎం కిసాన్ నిధులను విడుదల చేసిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి దృశ్యమాధ్యమ విధానంలో హాజరయ్యారు. అనంతరం 2 వేల 670 కోట్ల రూపాయల "పిఎం కిసాన్–అన్నదాత సుఖీభవ" 3వ విడత నిధులను రాష్ట్రంలోని 46 లక్షల 85 వేల మంది రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ....

వాయిస్....27 సెకన్లు

---------------------------

నేడు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పర్యటించనున్నారు. పాడేరు నియోజకవర్గం, నందిగరువు, ఓనూరు గ్రామాల్లో ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర పథకాలల్లో నిర్మించిన రోడ్లను పరిశీలిస్తారు. పీఎం జన్ మన్ పథకం నిధులతో ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు గ్రామం వరకు నిర్మించిన

2.4 కిలోమీటర్ల రహదారిని కాలి నడకన పరిశీలిస్తారు. నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేస్తూ, మార్గమధ్యంలో గిరిజనులతో మమేకమవుతారు. అనంతరం అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా నిర్మాణం పూర్తయిన రోడ్లను ఉపముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. నందిగరువు గ్రామ ప్రజలతో నిర్వహించే మాటా–మంతి కార్యక్రమంలో పాల్గొంటారు.

---------------------------

వచ్చే ఆరు నెలల్లో రాజధాని పరిధిలో ప్రస్తుతం ఉన్న రహదారులను అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్ళూరు నుంచి తాడికొండ వరకూ ఉన్న రోడ్డును మంత్రి నిన్న పరిశీలించారు. ఈ రోడ్డు బాగా దెబ్బతినడంతో గుంటూరు నుంచి రాజధానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు మంత్రికి విన్నవించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ...

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల 500 మంది మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్ల ఉత్పాదక కార్యకలాపాలకు 300 కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ పేరుతో ప్రతిపాదిత పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగింది. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ప్యాకేజ్ 63లో 24 కోట్ల 51 లక్షల రూపాయల అదనపు ఖర్చుకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 30 సఖి నివాస్ లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం వివరాలను సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడిస్తూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

తెలంగాణలో నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల 30 నిముషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిముషాల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల కోసం విద్యా శాఖ 2 వేల 676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్షలకు 5 లక్షల 28వేల 239 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

---------------------------

వచ్చె నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. వచ్చే మూడేళ్లలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తామన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం, దమ్మాయిగూడెం, బిరోలు గ్రామాల్లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల్లో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్...23 సెకన్లు

---------------------------

బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై మంత్రివర్గ సహచరులతో సమావేశాన్ని ఈ రోజు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ సమావేశంలో బీసీ మంత్రులతో పాటు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఎన్నికల హామీలో భాగంగా వెనుకబడిన తరగతులకు గౌరవ ప్రదమైన జీవనాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీనిలో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై ఇప్పటికే బీసీ మంత్రులు రెండు పర్యాయాలు భేటీ అయినట్లు పేర్కొన్నారు. మూడవ సమావేశం విజయవాడ సమీపంలోని తాడిగడప బీసీ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో ఈ రోజు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాశ్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ లు పాల్గొంటారని వెల్లడించారు.

---------------------------

ఎక్సైజ్ శాఖలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని ఆంధ్రపదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. విజయవాడలో నిన్న జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన 150 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో మెగా డిఎస్సి నిర్వహించి 16 వేల 347 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. భవిష్యత్ లో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎక్సైజ్ విధానాలు, చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని నూతన అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు, కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, ప్రతి గృహ వినియోగదారుడికి అవసరమైన మేర సిలిండర్లు సరఫరా చేస్తామని వెల్లడించారు. గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టించినా, బ్లాక్‌లో విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ విక్రయాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

=====================